మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**గద్వాల కలెక్టర్ బి.ఎం సంతోష్**



ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల ప్రతినిధి మే 17 ప్రభాతవార్త :** జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్ అన్నారు. శుక్రవారం గద్వాల్ మండల పరిధిలోని బీరెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ముసిని వెంకటేశ్వర్లుతో పాటు జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించి తీసుకొచ్చిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో నిబంధనల ప్రకారం సేకరించాలన్నారు. రైతులకు అక్కడ ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలున్నా రైతులు తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం కేంద్రాలకు వచ్చిందని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం గిడ్డంగుల రవాణా, రైతుల సాగు ధ్రువీకరణ పత్రాలు, కొనుగోలు, చెల్లింపు, గన్ని సంచులు, తదితర రిజిస్టర్ లను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు లత్తిపురం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఓ నర్సింగరావు, పౌర సరఫరాల శాఖ డీ.ఎం విమల, గద్వాల ఎం.పీ.డీ.వో ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.



పస్పుల పాఠశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ జి. రవినాయక్

## అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు వేగవంతం చేయాలి

- జడ్చర్ల, మిడ్జిల్ మండలంలో పనులు తనిఖీ చేసిన మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ తనిఖీ చేసిన రవినాయక్



గంగాపూర్ పాఠశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ రవినాయక్

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 17 ప్రభాతవార్త :** అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన మౌలిక వసతులు, రిపేర్ పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి.రవినాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ జడ్చర్ల, మిడ్జిల్ మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులు తనిఖీ చేశారు. జడ్చర్ల మండలం గంగాపూర్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మిడ్జిల్ మండలం పసుపుల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా జరుగుతున్న ఎలక్ట్రిఫికేషన్ పనులు, టాయిలెట్ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పనుల వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలల్లో వాటర్ సంప్ పనులు కూడా మొదలు పెట్టాలని, పనులు వేగవంతం చేసి పాఠశాలలు ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి రవిందర్, ఆయా మండలాల ఎంఈఓలు, ఎంపిడిఓలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.




రాయ్ బరేలీలో రాహుల్ గాంధీ గెలుపు కోసం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్, ఎంపీ అభ్యర్థి

## రాయ్‌బరేలిలో పాలమూరు నేతలు

- రాహుల్ గాంధీ ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, వంశీకృష్ణ, మేఘారెడ్డి ఎంపీ అభ్యర్థి మల్లురవి, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత
- లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు ఇండియా కూటమిదే అంటూ పునరుద్ఘాటన

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, గద్వాల ప్రతినిధి, మే 17 ప్రభాతవార్త: దేశ వ్యాప్తంగా జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమీ విజయం సాధిస్తుందని, ఎన్డీయే కూటమికి ఓటమి ఖాయమని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, మేఘారెడ్డి, వంశీకృష్ణ, గద్వాల జెడ్పీ చైర్మన్ సరిత తిరుపతయ్య అన్నారు. శుక్రవారం వారు రాయ్‌బరేలి నుంచి ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. యువనేత రాహుల్ గాంధీయే దేశ ప్రధాని అవుతారని రాయ్ బరేలీలో ప్రచారం చేస్తున్న తమకు స్థానికులు బ్రహ్మరథం పడుతున్నారని చైర్మన్ సరిత వెల్లడించారు. ఇప్పటికే బ్యాంకుల, విమానాశ్రయాలను, విద్యా వ్యవస్థలను ప్రైవేట్ పరం చేశారని రేపు అధికారంలోకి వస్తే అంతా ప్రైవేటుపరం అవుతుందని పేర్కొన్నారు. అదే విధంగా రైతాంగ వ్యవసాయ రుణాలు ఇవ్వకుండా గాలికి వదిలేశారని ఆమె తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టో విప్లవాత్మకంగా ఉందని, కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించగలదని దేశ ప్రజలు విశ్వసిస్తున్నారని తెలిపారు. అంతే కాకుండా ఈ దేశ ప్రజల మనోభావాలకు, ఆకాంక్షలకు అనుకూలంగా కాంగ్రెస్ పాలన కొనసాగుతుందన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవి భారీ మెజారిటీతో గెలుపొందుతారని, అదే ఉత్సాహంతో రాహుల్ గాంధీ గెలుపు కోసం రాయిబరేలి వచ్చినట్లు తెలిపారు.



ప్రచారంలో నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యేలు రాజేష్ రెడ్డి, వంశీకృష్ణ, మేఘారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సరితాతిరుపతయ్య

## ఉమా మహేశ్వర క్షేత్రంలో నాగర్‌కర్నూల్ కలెక్టర్



**అచ్చంపేట, మే 17 ప్రభాతవార్త:** శ్రీశైల ఉత్తర ద్వారంగా పిలువబడే శ్రీ ఉమా మహేశ్వర పుణ్య క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. కలెక్టర్ కుమారుడు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని స్వామి వారికి గణపతిపూజ, ఉమాదేవి పూజా, అభిషేకం, కుంకుమార్చనతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకున్న కలెక్టర్ దంపతులను ఆలయచైర్మన్ కందూరు సుధాకర్ ఆధ్వర్యంలో ఆలయఅర్చకులు శాలు వాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

# పాఠశాలల్లో మౌలిక వసతులు యుద్ధప్రాతిపదికన చేపట్టండి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి
- వనపర్తి జిల్లాలో 537 ప్రభుత్వ పాఠశాలలు
- అమ్మ ఆదర్శ పాఠశాల కింద 317 స్కూళ్ల ఎంపిక
- వనపర్తి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ వెల్లడి



హాజరైన గద్వాల కలెక్టర్, అదనపు కలెక్టర్

వనపర్తి ప్రతినిధి, మే 17, ప్రభాతవార్త: పాఠశాలలు పున:ప్రారంభం అయ్యేలోగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమార్ జిల్లా కలెక్టర్లతో అమ్మ ఆదర్శ పాఠశాల, ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాల పంపిణీ, ధరణి, ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం, వరి కొనుగోలు, సి.యం.ఆర్ ధాన్యం అప్పగింత పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వివరిస్తూ వనపర్తి జిల్లాలో 537 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 183 పాఠశాలలు మన ఊరు మనబడి కార్యక్రమం కింద మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం ద్వారా 317 పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు పనులు గుర్తించి మరమ్మతు పనులు యుద్ధప్రాతిపాదికన నడుస్తున్నాయని తెలిపారు. పాఠశాలకు అవసరమైన విద్యుత్, తాగు నీరు, మరుగుదొడ్లు, ఇతర మరమ్మతు పనులు గుర్తించి చేపట్టడం జరుగుతుందన్నారు. పాఠశాలకు పున:ప్రారంభం అయ్యేలోగా పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు ఇచ్చేందుకుగాను ఇప్పటికే అవసరమైన మేరకు బట్ట రావడం జరిగిందని, ఇతర మెటీరియల్ తెప్పించి మహిళా సంఘాల ద్వారా కుట్టించే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. జిల్లాలోని 42,681 విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టించడం జరుతుందన్నారు. ఇందులో 22,393 మంది అమ్మాయిలు, 20,288 అబ్బాయిలు ఉన్నట్లు తెలిపారు. ఏకరూప దుస్తులు పాఠశాల ప్రారంభం నాటికి విద్యార్థులకు అందించే విధంగా కార్యాచరణ ప్రణాళిక చేసుకోవడం జరిగిందన్నారు. వరి కోనుగోలు కేంద్రాల పై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని, రైతులు పండించిన ధాన్యం వర్షాలకు తడిచి నష్టపోకుండా ఎప్పటికప్పుడు సేకరించిన ధాన్యాన్ని తరలించే విధంగా చ్యలు తీసుకోవడం జరుతుందన్నారు. మిల్లర్ల ద్వారా సి యం.ఆర్ ధాన్యం అప్పగింత పై పకడ్బందీగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ యం.నగేష్ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




హాజరైన వనపర్తి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

### పనులు సత్వరం పూర్తి చేయాలి

గద్వాల ప్రతినిధి , మే 17 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన మౌలిక వసతుల పనులను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులతో కలిసి అమ్మ ఆదర్శపాఠశాల కమిటీలచే అభివృద్ధి పనులు, ధరణి దరఖాస్తులు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ జిల్లా అదనపు కలెక్టర్లు అపూర్వ చౌహాన్, ముసిని వెంకటేశ్వర్లుతో కలిసి ఈ వీడియో సమావేశంలో పాల్గొన్నారు. ఈ వీడియోకాన్ఫరెన్సు లో సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన కనీస మౌలిక వసతుల అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయాలని, పాఠశాలలను పునప్రారంభించేందుకు మనకు మరో 20 రోజులు గడువు మాత్రమే ఉందని, ఆ లోగా మంజూరు చేసిన అభివృద్ధి పనులను తప్పనిసరిగా పూర్తి చేసి పాఠశాలను ప్రారంభించేందుకు సన్నద్ధం కావాలని సిఎస్ కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాల్లో కుట్టు మిషన్లలో అనుభవం కలిగిన స్వశక్తి మహిళా సంఘాలకు సభ్యులను గుర్తించి స్కూల్ యూనిఫాంలు కుట్టే ఆర్డర్ అందించాలని సిఎస్ – మిగతా2లో..



వీసీలో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

# రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

**టోకెన్ ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలి**
**అదేరోజు మిల్లుకు రవాణా చేయాలి**
**మూడు రోజుల్లో రైతులకు చెల్లింపులు జరగాలి**
**ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ జి. రవినాయక్**



తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రవినాయక్



తూకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రవినాయక్

**మహబూబ్‌నగర్ బ్యూరో/మిడ్జిల్, మే 17 ప్రభాతవార్త :** రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రం ద్వారా వరిధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ మిడ్జిల్ మండలం రాణిపేట గ్రామంలో ఏర్పాటు చేసి పిఎసిఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం, తేమశాతం పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లు, రవాణా, ట్యాబ్ ఎంట్రీ గురించి – మిగతా2లో..

## తుది జాబితా విడుదల చేసిన జిల్లా కలెక్టర్ సంతోష్



**గద్వాల ప్రతినిధి మే 17 ప్రభాతవార్త:** జోగుళాంబ గద్వాల జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల నందు ఔట్‌సోర్సింగ్ ఖాళీల నియామకము కొరకు డాటా ఎంట్రీ ఆపరేటర్ 11, ఆఫీస్ సబార్డినేట్ 9, ల్యాబ్ అటెండెంట్ 3. థియేటర్ అసిస్టెంట్ 1 కొరకు ప్రకటన జారీ చేయగా, జోగులాంబ గద్వాల జిల్లా స్థానికులకు మాత్రమే పరిగణలోకి తీసుకొని అర్హుల నుండి వచ్చిన దరఖా స్తుల వివరములు సంబంధించిన జాబితా క్రింది విధంగా విడుదల చేసినట్లు జిల్లా సెలక్షన్ కమిటీ అధ్యక్షులు బి.యం.సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. డాటా ఎంట్రీ ఆపరేటర్ 672, ఆఫీస్ సబార్డినేట్ 1483, ల్యాబ్ అటెండెంట్ 201 థియేటర్ అసిస్టెంట్ 14 చొప్పున మొత్తం 2370 సేకరించడం జరిగిందని, అర్హులైన దరఖాస్తుదారులకు సంబంధించిన తుది జాబితా ఈరోజు విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ నెల 20వ తేదీన ప్రతి పోస్టుకు సంబంధించి లాటరీ ద్వారా పాత యంపిడిఓ కార్యాలయం, జోగులాంబ గద్వాల జిల్లా నందు తీయడం జరుగుతుందని, ఇట్టి విషయాన్ని దరఖాస్తుదారులు గమనించగలరని ఆయన ప్రకటనలో తెలిపారు.

# ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం

- 21 కేంద్రాల్లో పరీక్ష రానున్న 10,304 విద్యార్థులు..
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్
- సమన్వయంతో పరీక్షలు నిర్వహించాలి: డిఆర్‌ఓ రవికుమార్



పరీక్షలపై సమీక్ష నిర్వహించిన డిఆర్‌ఓ, డిఐఈఓ

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 17 ప్రభాతవార్త :** ఈనెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలను అన్ని డిపార్టుమెంట్ల అధికారులు సమన్వయంతో, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్‌ఓ) రవికుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు ఐడిఓసి కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీధర్ సుమర్ పరీక్ష వివరాలు తెలియజేశారు. జిల్లాలో 21 పరీక్ష కేంద్రాలలో మొదటి సంవత్సరం 6585 మంది, రెండవ సంవత్సరం 3719 మంది విద్యార్థినీ, విద్యార్థులు మొత్తం 10,304 మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు వెల్లడించారు. ప్రథమ పరీక్షలు ఉదయం 9 గం.ల నుండి మధ్యాహ్నం 12 గం.ల వరకు ద్వితీయ సంవత్సర పరీక్షలు మధ్యాహ్నం 2.30 గం.ల నుండి 5.30 గం.ల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి పరీక్ష కేంద్రం వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్ష సమయానికి విద్యార్థినీ, విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, ఒక నిమిషం ఆలస్యం అయిన పరీక్ష కేంద్రానికి అనుమతి ఉండదని తెలిపారు. గ్రామాల నుంచి విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి వీలుగా ఆర్టీసి అధికారులు ప్రత్యేక బస్సులను ఉదయం 7 గం.లకు అందుబాటులో ఉంచాలని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్ష కేంద్రానికి సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రాల వద్ద హాల్ టికెట్‌లలో ఏదైనా సమస్య ఉంటే విద్యార్థులకు సహకరించేందుకు తగు మార్గనిర్దేశం చేయాలని ఆదేశించారు. పరీక్షా సమయంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో త్రాగునీరు. మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, వైద్య అధికారులు సిబ్బందిని నియమించి ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ఏర్పాటు చేసి అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, హెల్త్ కిట్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈసీ సభ్యులు ఉమా మహేశ్వర్, రవిందర్, పోలీస్ శాఖ, విద్యుత్, ఆర్టీసి, వైద్యం, మున్సిపల్ శాఖ తదితర అధికారులు కార్యాలయ సిబ్బంది సందీప్, సాదిక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ క్లీనిక్‌లపై దాడులు

- ఓ క్లినిక్‌ను సీజ్ చేసిన అధికారులు
- డాక్టర్లని బోర్డు తగిలించుకున్న ఆర్ఎంపీలకు నోటీసులు..



ఆర్ఎంపీ సంతోష్ క్లినిక్‌లో ఓ గిరిజన మహిళకు సెలైన్ ఎక్కిస్తున్న దృశ్యం



పోలీస్‌ల సమక్షంలో క్లినిక్‌ను సీజ్ చేస్తున్న జిల్లా మాస్ మీడియా అధికారి డాక్టర్ తిరుపతిరావు

**భూత్పూర్, మే17, ప్రభాతవార్త:** క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టిషనర్(ఆర్ఎంపీ)లు గ్రామాల్లో ప్రమాదాలు జరిగినప్పుడు ప్రథమ చికిత్సను అందించి తమ వద్దకు వచ్చిన రోగులకు తగిన సలహాలు, సూచనలందిస్తూ వారిని వైద్య నిపుణులు, జిల్లా ప్రధాన ఆసుపత్రులకు రెఫర్ చేయాల్సి ఉండగా, ఇందుకు భిన్నంగా కొందరు ఆర్ఎంపీలు గ్రామాల్లో తామే డాక్టర్లమని చెలామణి అవుతూ, ఎక్కువ డోస్ యాంటిబయాటిక్ మందులిస్తూ, బోర్డులపై తమ పేర్లకు ముందు డాక్టర్ –మిగతా2లో..

## విద్యుదాఘాతానికి గురై యువకుడు దుర్మరణం

**కల్వకుర్తి, మే 17 ప్రభాతవార్త:**విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి కల్వకుర్తి పట్టణంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... కల్వకుర్తి పట్టణంలోని ఇందిరన గర్ కాలనీకి చెందిన రాము (22) అనే యువకుడికి స్థానికంగా ఓ కిరాణ షాపులో పనిచేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. మృతుడు రోజు వారిగా తాను పనిచేసే కిరాణ షాపులో పనులను ముగించుకొని ఇంటికి వెళ్లే మార్గంలో ఓ షాపు వద్ద నిలిచి ఉండటంతో తీవ్ర ఈదురు గాలులతో కూడిన వర్షం కారణంగా విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ప్రమాద స్థలిలో విద్యుత్ వైర్లు రాముకు తగలడంతో ఘటన స్థలంలోనే అక్కడికక్కడే మృతి చెందాడని స్థానికులు సూచించారని ఎస్ఐ పేర్కొన్నారు. ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించి మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మాధవరెడ్డి పేర్కొన్నారు.



## జీవిత భీమా మేనేజర్‌కు ఘన సన్మానం...

**కల్వకుర్తిటౌన్, మే 17 ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణంలోని జీవిత భీమా కార్యాలయ బ్రాంచ్ మేనేజర్ హరిలాల్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా జీవిత భీమా ఏజెంట్ల సంఘం (లియోఫి) ఆధ్వర్యంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లియోఫి సంఘం ప్రధాన కార్యదర్శి రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి బ్రాంచీలో 3 సంవత్సరాల పాటు సేవలందిచి నేడు బదిలీపై జనగాం వెళ్తున్న సందర్భంగా వీడ్కోలు సమావేశం నిర్వహించి హరిలాల్ దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కల్వకుర్తిలో విధులు నిర్వహించి పాలసీ దారులకు, ఏజెంట్లకు మంచి సేవలు అందించారని, జనగామాలో కూడా మంచి సేవలందించాలన్నారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి చిదిరె శ్రీనివాసులు, సంఘం సభ్యులు, అచ్చంపేట శాటిలైట్ బ్రాంచ్ మేనేజర్ వెంకన్న, జీవిత కార్యాలయ సిబ్బంది, డెవలప్‌మెంట్ స్టాప్, సబ్‌స్టాప్ తదితరులు ఉన్నారు.



## పీయూకు కుర్చీలు వితరణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 17 ప్రభాతవార్త :** పాలమూరు యూనివర్సిటీ క్యాంపస్‌కు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వాళ్లు 15 సిమెంట్ కుర్చీలను రోడ్డు ఇరువైపుల ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఉప కులపతి ప్రొ॥ లక్ష్మీకాంత్ రాథోడ్ మాట్లాడుతూ క్యాంపస్‌లో 15 సిమెంట్ కుర్చీలను చెట్ల కింద ఏర్పాటు చేయడం ద్వారా ఆహ్లాదకర వాతావరణం ఏర్పడిందని, విద్యార్థులు క్యాంపస్‌లో అన్ని సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని ఎదగాలని, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా. మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసమూర్తి (డీ రీజినల్ హెడ్) ఆర్‌జి యాదవ్ (చీఫ్ మేనేజర్), క్రిటి జస్సల్ (సీనియర్ మేనేజర్), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ ఆఫీస్ మహబూబ్‌నగర్, సూర్య తదితరులు పాల్గొన్నారు.



## యువతను క్రీడల్లో ప్రోత్సహించాలి

**రాజమౌళి ముదిరాజ్**

**కొత్తకోట మే 17 ప్రభాతవార్త :** యువతను క్రీడల్లో ప్రోత్సహించాలని బిజెపి మండల నాయకులు రాజమౌళి ముదిరాజ్ అన్నారు. శుక్రవారం కొత్తకోట మండలం వడ్డేవాట గ్రామంలోని యువకులకు క్రికెట్ కిట్టు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో రానించాలని కోరారు. క్రీడలను ప్రోత్సహించేందుకే క్రికెట్ కిట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. యువకులకు క్రీడాలో రానించి గ్రామానికి మంచి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మండ్ల శంకర్ బాబు, సుక్క వెంకటేష్, సుక్క మహేష్, గుంటిపల్లి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రైవేట్ క్లినిక్‌లపై దాడులు..!!

**మొదటి పేజీ తరువాయి భాగం..**

అని పేర్కొంటూ, ఇన్‌జెక్షన్లు, సెలైన్లు ఎక్కిస్తూ ప్రజల జీవితాలతో చెలగాట మాడుతున్నారనే సమాచారం అందుకున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా మాస్ మీడియా అధికారి డాక్టర్ తిరుపతిరావు నేతృత్వంలో వైద్యబృందం భూత్పూర్ పట్టణ, గ్రామీణ ప్రాంతా లలో ఆర్‌ఎంపీ క్లినిక్‌లపై విస్తృతంగా తనిఖీలు నిరహించారు. తనిఖీలు నిర్వహించే సమయంలో పట్టణంలోని చౌరస్తాలో ఉన్న సంతోష్ అనే ఆర్‌ఎంపీ ఓ గిరిజన మహిళకు సెలైన్ ఎక్కించడం చూసి తనిఖీ బృందం అధికారి డాక్టర్ తిరుపతిరావు పోలీస్‌ల సమక్షంలో క్లినిక్‌ను సీజ్ చేశారు. ప్రథమ చికిత్సాలయంలో ఆర్‌ఎంపీలు బెడ్‌లు ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధం. వారి పేర్లకు ముందు డాక్టర్లమని బోర్డుల్లో పేర్కొనడం కూడా నేరమని తనిఖీ బృందం పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇరువురు ఆర్‌ఎంపీలు ఇదే రకమైన పొరపాట్లకు పాటుపడడంతో వీరికి నోటీసులు జారీ చేశారు. మరికొందరు ఆర్‌ఎంపీలు తనిఖీ బృందం వస్తున్నారని పసిగట్టి తమ క్లినిక్‌లకు తాళాలు వేసి మూసి ఉంచారు.

## ఘనంగా 331వ ఆరాధన మహోత్సవం

**తెల్కపల్లి, మే 17 ప్రభాతవార్త :** కాలజ్ఞాన సృష్టికర్త, కలియుగ దైవం శ్రీ విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధన మహోత్సవ కార్యక్రమం మండల పరిధిలోని కమ్మరెడ్డిపల్లి గ్రామంలోని శ్రీ వీర బ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించినట్లు అర్చకులు మారోజు ఉమాపతి ఆచార్యులు తెలిపారు. ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, పూజలు, కుంకుమార్చన, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు సూరినేని వంశస్థుల ఆధ్వర్యంలో దేదీప్య మానంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, అన్నప్రసాద వితరణ చేశారు.



## రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

**(మొదటి పేజీ తరువాయి)**

సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తడవకుండా టార్పాలిన్‌లతో కవర్ చేయాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బంది లేకుండా టోకెన్ ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని, అదేరోజు ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేయాలని ఆదేశించారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం ట్యాబ్ ఎంట్రీ చేసి, ట్రక్ షీట్ జనరేట్ చేసి మూడు రోజుల్లో రైతులకు చెల్లింపు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ ఉన్నారు.

**పాఠశాలల్లో మౌళిక వసతులు**

## యుద్ధప్రాతిపదికన చేపట్టండి

**(మొదటి పేజీ తరువాయి)**

కలెక్టర్లకు సూచించారు. పాఠశాలలు పున ప్రారంభానికి ముందే విద్యార్థులందరికి తప్పనిసరిగా యూనిఫాం లు అందించే విధంగా సన్నద్ధమయ్యేలా రెగ్యులర్‌గా మానిటరింగ్ చేయాలని సీఎస్ సూచించారు. ప్రజావాణి దరఖాస్తులలో అధికంగా రెవెన్యూ, ధరణి సంబంధిత సమస్యలు అధికంగా వస్తున్నాయని, వీటిని ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో జూన్ 7 వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిలిపివేశామని, ప్రజావాణి కార్యక్రమం పున:ప్రారంభానికి ముందే పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులు పూర్తిస్థాయిలో పరిష్కరించాలని సీఎస్ అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో రామచందర్, డిఆర్‌డిఓ నర్సింగరావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఇందిర, పంచాయితీరాజ్ ఈఈ విజయ్ కుమార్, విమల పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ సప్లీమెంటరీ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు...

**గద్వాల ప్రతినిధి మే 17 ప్రభాతవార్త :** ఇంటర్మీడియట్ సప్లీమెంటరీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు ఇంటర్ సప్లీమెంటరీ పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయన్నారు. మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్ పరీక్షలు మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జరుగుతున్నట్లు తెలిపారు. పరీక్షలలో ఎటువంటి మాస్ కాపీలు జరగకుండా ప్లేయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ లను నియమించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో



అధికారులతో సమీక్ష చేస్తున్న అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్

ఉంటుందని, పోలీస్ శాఖ వారు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని జిరాక్స్ కేంద్రాలని మూసివేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ప్రథమ చికిత్స అందించుటకు ఏ ఎన్ ఎం లను ఏర్పాటు చేయాలని వైద్య అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసి వారికి సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలన్నారు. జిల్లాలో 3,664 మంది విద్యార్థులు 09 పరీక్ష కేంద్రాలలో రాస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులతో పాటు సిబ్బంది కేంద్రాల్లో కి సెల్ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావొద్దని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్ డి ఓ రామ్ చందర్ ,డి ఎస్ పి కే.సత్యనారాయణ ,ఇంటర్మీడియట్ అధికారి హృదయ రాజు, డిప్యూటి డి.ఎం.హెచ్.ఓ సిద్దప్ప తదితరులు పాల్గొన్నారు.

# దేవరకద్రలో ఘనంగా వాసవిమాత పల్లకిసేవ..

**- అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు**

**దేవరకద్ర, మే 17 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవస్థానం చుట్టూ ప్రదిక్షణలు నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు, భక్తులు హరినామశ్చరణల మధ్య ఈ సేవ ముందుకు కదిలింది. అనంతరం అర్చకుడు హరిశంకరశర్మ అధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవిమాత అమ్మవారు భక్తులకు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.





వాసవిమాత అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



కుంకుమార్చన పూజ నిర్వహిస్తున్న మహిళా భక్తులు

**ఘనంగా కుంకుమార్చన..** దేవస్థానంలో శ్రీ చక్రాలతో అమ్మవారికి కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే లలితా సహస్రనామపారాయణం కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు. పంచామతాలతో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజ నిర్వహించారు. మహామంగళహారతి, ప్రసాదవితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కల్వకన్నయ్యశెట్టి, మహిళాసంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణీ, జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్యలతో పాటు స్థానిక ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు పరామర్శించిన ఎమ్మెల్యే

**కల్వకుర్తి, మే 17 ప్రభాతవార్త:**గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండలం వాస్‌దేవ్‌పూర్ గేటు వద్ద పిడుగు పాటుకు గురై మృతి చెందిన మాడ్గుల మండలం కలకొండ గ్రామానికి చెందిన ప్రవీణ్ మృతదేహన్ని కల్వకుర్తి పట్టణంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన రాము మృతదేహన్ని కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పిడుగు పాటు ప్రమాదంలో గాయపడిన మాడ్గుల మండల కేంద్రానికి చెందిన నిరంజన్‌గౌడ్ వెల్దండ మండల సమీపంలోని యెన్నమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి యెన్నమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిరంజన్‌గౌడ్‌ను పరామర్శించి వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.5వేల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు అందించి మనోధైర్యం కల్పించారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు. అదే విధంగా ప్రభుత్వాసుపత్రిలో ప్రవీణ్, రాము కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటానని హామీ ఇచ్చి ఒక్కో కుటుంబానికి రూ.5వేల వ్యక్తిగతంగా ఆర్థిక సహాయాన్ని అందించారు. ఎమ్మెల్యే వెంట ఆయా మండలాల కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

# కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన కస్తూరి కృష్ణ తేజ్...

**- మలేషియాలోని కుమిటేలో బంగారు పతకం, కటాలో కాంస్య పతకం గెలుపు...**

**వంగూరు, మే 17 ప్రభాతవార్త:**కరాటే ఓపెన్ చాంపియన్ షిప్‌లో హైదరాబాద్ కర్మాన్‌ఘాట్‌లోని దిల్‌సుఖ్‌నగర్ పబ్లిక్ స్కూల్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి కస్తూరి కృష్ణ తేజ్ సత్తా చాటారు. 20వ అంతర్జాతీయ ఒకినావా గోజుర్యు ఇపోసిటీ కరాటే ఓపెన్ చాంపియన్ షిప్-2024 పోటీలో మే 10,11,12వ తేదీల్లో మలేషియా ఇపోసిటీలోని పెరాక్ అరెనా స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు చాంపియన్ షిప్ గెలుచుకున్నారని, ముఖ్యంగా 16 సంవత్సరాల లోపు 50 కిలోల విభాగంలో నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన కస్తూరి రవి, జ్యోతిల కుమారుడు కస్తూరి కృష్ణతేజ్ కుమిటేలో బంగారు పతకం, కటాలో కాంస్య పతకం గెలుచుకున్నాడని షోభుకై అకాడమీ కరాటే చీఫ్ మాస్టర్ కే సామ్యూల్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు మాట్లాడుతూ కొడుకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది కరాటేలో బంగారు, కాంస్య పతకాలు సాధించడం తమకెంతో గర్వకారణమని సంతోషం వ్యక్తం చేశారు. కృష్ణతేజ్ చదువులతో పాటు క్రీడల్లో చురుకుగా పాల్గొనేవాడని తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పట్ల గౌరవంతో ఉండేవాడని పలువురు కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొని రావాలని మండల వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



బంగారు పతకం సాధించిన కృష్ణతేజ్

# కామ్రేడ్ ఈర్ల నరిసింహ ఆశయాలను సాధిద్దాం : సిపిఐ

**వనపర్తి ప్రతినిధి మే 17 ప్రభాతవార్త :** పేద ప్రజల పక్షాన వారి హక్కులు, సమస్యల సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన కామ్రేడ్ ఈర్ల నరసింహ ఆశయాలను సాధిద్దామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే శ్రీరామ్, సిపిఐ వనపర్తి మండల కార్యదర్శి జే రమేష్ పిలుపునిచ్చారు. దివంగత సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి ఈర్ల నరసింహ ప్రథమ వర్ధంతిని సిపిఐ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యార్థి దశలోనే ఏఐఎస్ఎఫ్‌లోనే చేరి అనంతరం బిజినేపల్లి మండలం వెలుగొండ గ్రామ సర్పంచ్ గా ఎంపీటీసీగా వైస్ ఎంపీపీ గా 38 ఏళ్ళు ప్రజా ప్రతినిధిగా పనిచేశారన్నారు. సిపిఐ సామాన్య కార్యకర్తగా రాజకీయ జీవితం ప్రారంభించి మూడుసార్లు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శిగా , రాష్ట్ర కార్యవర్గ సభ్యులగా ఎదిగారన్నారు. వెలుగొండలో వ్యవసాయ కూలీ పెంపు కోసం ,జీతగాళ్ల వేతనాల పెంపు కోసం, జిల్లాలో పేదలకు ఇళ్ల స్థలాలు, ఇండ్లు ,ప్రభుత్వ భూములు, మత్స్య కార్మికుల సంఘాల ఏర్పాటుకు కృషి చేశారన్నారు. ప్రజల సమస్య ఎక్కడ ఉన్న అక్కడ ఆయన కనిపించే వారిని, దళిత ,బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు కొండంత అండగా ఉండేవారన్నారు. ఎద్దు దాడిలో గాయపడి కాలక్రమైనా అనారోగ్యానికి గురై అసులుభాసారన్నారు. ఆయన మరణం కమ్యూనిష్టు పార్టీకి ప్రజలకు తీరని లోటు అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లటమే నిజమైన నివాళి కాగలదన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా మాజీ అధ్యక్షులు పి. కళావతమ్మ, వనపర్తి మండల కార్యదర్శి జే రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు జే నరేష్, నాయకులు కొండన్న, చిన్న వెంకటేష్, విష్ణు, అశోక్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



కామ్రేడ్ ఈర్ల నరసింహ
చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సిపిఐ నాయకులు

# బిపి పరీక్షలు నిర్వహించుకుని మందులు వాడాలి : డీఎమ్ హెచ్ ఓ శశికళ

**గద్వాల ప్రతినిధి మే 17 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలో వైద్య ఆరోగ్యశాఖ బస్తీధవ ఖానా, అర్బన్ హెల్త్ సెంటర్ రాంనగర్‌లో శుక్రవారం వరల్డ్ హైపర్ టెన్షన్ డే ను వార్డు ప్రజల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిఎంహెచ్ఓ డాక్టర్ శశికళ, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సిద్ధప్ప, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రావంతి, డాక్టర్ బి రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శశికళ మాట్లాడుతూ బిపి మందులు వాడుతున్న ప్రతి ఒక్కరు ప్రతి నెల పరీక్షలు నిర్వహించుకుని మందులు వాడాలని , ప్రతి రోజు నడక వ్యాయామం, ధాన్యం చేస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని తెలిపారు. ఈ నెల 14 వ తారీకు నుండి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో , గ్రామాల యందు ఆశా కార్యకర్తల వారీగా 30 సంవత్సరంలో పైబడిన వారందరికీ టార్గెట్ పాపులేషన్ స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారని, అందరూ పరీక్షలు నిర్వహించుకుని, పలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. డిప్యూటీ డిఎంహెచ్‌వో మాట్లాడుతూ ఎవరికైనా పరీక్షలో అబ్నార్మల్ ఉన్నవారు జిల్లా ఆసుపత్రిలో ఎన్సిడి క్లినిక్ ఏర్పాటు చేయడం జరిగిందని అక్కడ పరీక్షలు నిర్వహించి పీజీ డాక్టర్లచే పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ శ్రావంతి, పివో ఎన్ సి డి డాక్టర్ జి రాజు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాధిక జిల్లా ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్స్ శ్యామ్ సుందర్, డబ్ల్యూ హెచ్ రమేష్, అర్బన్ హెల్త్ సెంటర్ సీఓ హనుమంతు, ఏఎన్ఎంలు మార్త, సువర్ణ ఆశా కార్యకర్తలు , ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




ప్రపంచ హైపర్ టెన్షన్ డే లో పాల్గొన్న జిల్లా వైద్యాధికారిణి శశికళ, వైద్యులు, ఆషాలు

## తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



**కల్వకుర్తి, మే 17 ప్రభాతవార్త:**రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వర్‌రావును శుక్రవారం ఆయన చాంబర్‌లో కల్వకుర్తి, ఊర్కొండ మండలాల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. కల్వకుర్తి మండలానికి చెందిన దామోదర్‌గౌడ్, ఊర్కొండ మండలానికి చెందిన రమేష్‌నాయక్‌లు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సన్మానించారు.

## ఫర్టిలైజర్ దుకాణాలను తనఖీ చేసిన ఏఓ



**దేవరకద్ర, మే 17 ప్రభాతవార్త:** దేవరకద్రలో విత్తనాలు అమ్మే ఫర్టిలైజర్ దుకాణాలను శుక్రవారం మండల వ్యవసాయాధికారి రాజేందర్ అగర్వాల్ ఆకస్మిక తనిఖీలు చేశారు. వానాకాలం ప్రారంభం అవుతున్నందున ముందు జాగ్రత్తగా స్థానిక పాత, కొత్త బస్టాండు ప్రాంతాలలో ఉన్న ఫర్టిలైజర్ దుకాణాలను వ్యవసాయాధికారి ఈ తనఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనమతిలేని, కల్తీ విత్తనాలు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసు కొంటామని దుకాణాల యజమానులకు హెచ్చరించారు.

## 18న మిషన్ భగీరథ నీటి సరఫర నిలిపి వేత...

**గద్వాల ప్రతినిధి మే 17 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం రేవుల పల్లిలోని నీటి శుద్ధి కర్మాగారాన్ని ఈ నెల 18వ తేదీ న శనివారం శుభ్రపరుస్తున్నందున మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు ,ప్రజలు అందుకు సహకరించాలని మిషన్ భగీరథ గ్రిడ్ డీఈఈ రవిచంద్ర కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## నేటి మండల సర్వసభ్య సమావేశం వాయిదా

**ఉప్పునుంతల, మే17 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జరగనున్న మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపిడిఓ లక్ష్మణరావు తెలిపారు. అనివార్యకారణాల చేత ఈ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సమావేశాన్ని ఈనెల 22వ తేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## బండారు ఉత్సవాల్లో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. కొండయ్య



**మక్తల్, మే 17 ప్రభాతవార్త :** మక్తల్ మండలం లింగంపల్లి గ్రామ మాదాసి కురువ సోదరుల ఆరాధ్య దైవం అయినటువంటి బీరప్ప బండారు మహోత్సవంలో రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు బి. కొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కురువ సోదరులందరికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు భూత్పూర్ హనుమంతు, కల్లూరు నాగప్ప, సత్య, శ్రీను, తాయప్ప, రాజాగౌడ్, నరసింహ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

